అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం






ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 07త మార్చి, 2026 | పేజీలు :08


# ఘనంగా శివపార్వతుల కల్యాణం



**ప్రజా పక్షం/వేములవాడ:** తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శివకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ పార్కింగ్ స్థలం వద్ద ఏర్పాటు చేసిన శివార్చన వేదికను రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం రాజన్న ఆలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, ధ్వజారోహణం, బలిహరణ వంటి కార్యక్రమాలను వేద మంత్రాల నడుమ అర్చకులు నిర్వహించారు. అనంతరం శివార్చన వేదిక వద్ద ఎదుర్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరుడి తరఫున రామకృష్ణ వరకట్నంగా వెయ్యి కోట్లు కావాలని కోరగా, అమ్మవారి తరఫున ఆలయ ఈఓ ఎల్. రమాదేవి అంగీకరించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై మంగళవాయిద్యాల నడుమ శ్రీ పార్వతి సమేత రాజరాజేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను తీసుకొచ్చి కళ్యాణ తంతును వైభవంగా నిర్వహించారు. ఈ శివపార్వతుల కళ్యాణాన్ని తిలకించేందుకు సుమారు 50 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యారు. కన్యాదాత దంపతులుగా ఈశ్వరగారి సురేష్, నాగలక్ష్మి పాల్గొన్నారు. ఆలయం తరఫున ఈఓ ఎల్. రమాదేవి స్వామి వారికి పట్టు వస్త్రాలను అందజేశారు. వేములవాడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు, వైస్ ఛైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీత బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కళ్యాణానికి విచ్చేసిన భక్తులకు త్రాగునీరు, అన్న ప్రసాదం వంటి ఏర్పాట్లు చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. శివ పార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా విజయవంతంగా నిర్వహించబడిందని ఆలయ ఈఓ ఎల్. రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, భక్తులు, వివిధ శాఖల అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# పెట్రోల్ పోసుకొని దంపతుల ఆత్మహత్యాయత్నం

అక్రమంగా తమ భూమిని ఇతరుల పేరుపై చేశారు

గ్రామ పంచాయతీ సిబ్బంది లంచాలకు అలవాటు పడ్డారని ఆరోపణలు



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** గ్రామ పంచాయతీ కార్యాలయంలోనీ దంపతులు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేసిన ఘటన జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు తమ కుటుంబానికి చెందిన భూమిని అక్రమంగా ఇతరుల పేరుపై నమోదు చేశారని మోతెగ్రామానికి చెందిన రాజేష్, శిరీష దంపతుల కుటుంబాని కి చెందిన 25 గుంటల వ్యవసాయ భూమితో పాటు ప్రభుత్వ ప్లాటును తమ సొంత బాబాయ్ఓలుగొత్తుల చిన్న పోచయ్య, అతని కొడుకు రాజ్ కుమార్ అక్రమంగా పేరు మార్పిడి చేయించుకున్నారని బాధితులు రాజేష్,శిరీష దంపతులు ఆరోపిస్తున్నారు.ఓలుగొత్తుల నడిపి పోచయ్య తమ తండ్రికి 2022 లో మృతి చెందిన తర్వాత ఈ వ్యవహారం అంత జరిగిందని వారు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది లంచాలకు ఆశపడి భూమిని వేరే వ్యక్తుల పేరున మార్పిడి చేశారని,ఈ విషయంలో న్యాయం కోసం పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో విసిగిపోయి ఇవాళ తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేసినట్టు గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తమై వారిని అడ్డుకోవడంతో రాజేష్, శిరీష దంపతులు ప్రమాదం నుంచి బైట పడ్డారనీ స్థానికులు చెబుతున్నారు.

# ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేస్తూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో 99 రోజుల కార్యక్రమం అమలుపై నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా గెలిచిన స్థానిక నాయకులకు ప్రజలలో మంచి పేరు సుస్థిరం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, మార్చి 6 నుంచి మార్చి 15 వరకు జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ లో స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కౌన్సిలర్ లకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య సంబంధించి చేయాల్సిన పనులు చైర్ పర్సన్ దృష్టికి తీసుకొని వస్తె వెంటనే వాటిని పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.మున్సిపల్ పరిధిలో పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తామని, ఏ ఫైల్ తిరస్కరించిన స్పష్టమైన కారణం తెలియజేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. 99 రోజుల కార్యక్రమంలో చివరి వరకు ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గోన్నాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, వైస్ చైర్ పర్సన్ ముస్కాన్ నాజ్ ,పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# బ్రూక్లిన్ పాఠశాలలో ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** మెట్‌పల్లి పట్టణంలోని బ్రూక్లిన్ పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు. రక్షణ పద్ధతులపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొని ఫైర్ ఎక్స్టింగ్విషర్, ఫైర్ హోస్, సేఫ్టీ హెల్మెట్, లైఫ్ జాకెట్ వంటి రక్షణ పరికరాలను విద్యార్థులకు చూపించి వాటి వినియోగ విధానాన్ని వివరించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలా స్పందించాలి, ప్రమాదాన్ని ఎలా నివారించాలి, అత్యవసర పరిస్థితుల్లో ఎలా సురక్షితంగా బయటపడాలి అనే అంశాలపై విద్యార్థులకు ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని ఫైర్ సేఫ్టీ గురించి ముఖ్యమైన విషయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో ప్రమాదాలను ఎదుర్కొనేందుకు అవసరమైన జ్ఞానం మరియు ధైర్యం విద్యార్థులకు కలిగిందని నిర్వాహకులు తెలిపారు.




## పారిశుద్ధ్య నిర్వహణ చేయాలి

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మార్చి 6నుండి జూన్ 12 వరకు గ్రామాలు, అర్బన్ ప్రాంతాలలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రగతి ప్రణాళిక 99 రోజులు ఉంటుందని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి గుండోజు సత్తయ్య, ఎంపీవో జోగంరాజు అన్నారు. శుక్రవారం ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీరోజు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఫైళ్ళనిర్వహణ,క్లియరెన్స్,పలు ప్రాధన్యతతో కూడిన అంశాలు ఉంటాయన్నారు. అధికారులు చురుగ్గా వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంలో ఆయాశాఖల సంబంధిత అధికారులు హాజరుఅయ్యారు. కార్యక్రమంలో మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయం చేసుకుంటూ వంద శాతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంఇవో కృష్ణహరి, వైద్యాధికారి సరియాఅంజుం, ఏఎస్ఐ చంద్రశేఖర్, ఐకేపి ఏపిఎం జాతీయ ఉపాధిహామి పథకం ఏపివో, హౌజింగ్ ఇంజనీర్ చైతన్య, ఐసీడీఎస్ సుపర్వైజర్, హజరైనవారిలో ఉన్నారు.

## ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**ప్రజాపక్షం/పెగడపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల పాటు జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా మండలంలోని 23 పంచాయతీలలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా పారిశుద్ధ్యం, ఆరోగ్యం, మౌలిక వసతులు, పెండింగ్లో ఉన్న పనుల పరిష్కారం వంటి కార్యక్రమాలు మార్చి 6 నుండి జూన్ 12 వరకు ఐదు దశల్లో నిర్వహించనున్నారు. మండల ప్రజా పరిషత్ మరియు పంచాయతీ కార్యాలయాలలో పరిసరాల పరిశుభ్రత శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. కార్యాలయాల్లోని రికార్డు రూమ్ శుభ్రపరచి ఫైళ్లను పరిశీలించారు.ర్యాలీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆనంద్ కుమార్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఎంపీ ఓ శశి కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు గౌడ్, అరుణ, రాజమణి, రజిత, వనజ, మహేశ్వరి, భవాని, అంజమ్మ, మణెమ్మ, శ్రీవాణి, రజిత, చామంతి, రజిత, పాల్గొన్నారు.

## కరీంనగర్ మేయర్‌ను కలిసిన మోహన్ పటేల్

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** కరీంనగర్ మేయర్‌గా నియామకం అయిన కొలగని శ్రీనివాస్ ను శుక్రవారం ధర్మారం మండల కేంద్రానికి చెందిన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇమ్మడి శెట్టి మోహన్ పటేల్ మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కరీంనగర్ ను పట్టణాన్ని రాష్ట్రంలోనే అత్యున్నత స్థాయి లో అభివృద్ధి చేయాలని, కరీంనగర్‌ను అందమైన పట్టణంగా తీర్చి దిద్దాలని మేయర్ ను కోరారు.

## ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు వినియోగించుకోవాలి..

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు వినియోగించు కోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. ఎస్ రజిత తెలిపారు. అన్ని వయసుల వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. నిర్దేశిత రోజులలో నాలుగు దశలలో నిర్వహిస్తామని వివరించారు. మొదటి దశలో మార్చి 6 నుండి మార్చి 31 వరకు గర్భిణీలు, వృద్ధులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు తెలంగాణ డయాగ్నొస్టిక్స్ సెంటర్ ద్వారా ఆరోగ్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, ఆర్ బీ ఎస్ కే బృందాలు, ఇతర వైద్య సిబ్బందికి గర్భిణీ స్త్రీలకు , తల్లులకు అందవలసిన పోషకాహారము, వ్యాధినిరోధక టీకాలపై అవగాహన కల్పించడంతో పాటు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లపై ఆరోగ్య పరీక్షలు ప్రత్యేక వైద్య నిపుణుల ప్రసూతి స్త్రీ రోగనిపుణులు, పిల్లల వైద్య నిపుణులు, నేత్ర, కీళ్ల ఎముకల, దంత వైద్య నిపుణులతో పాటు జనరల్ మెడిసిన్ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన గర్భాశయ క్యాన్సర్ రాకుండా స్త్రీలకు హెచ్ పీవీ వ్యాక్సిన్ ఇస్తామని పేర్కొన్నారు.ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య సేవలు అందుబాటులోకి ఈ నెల (మార్చి ) 7వ తేదీన హనుమాజిపేట, 9వ తేదీన కోనరావుపేట, 10 వ తేదీన లింగన్నపేట, 11 వ తేదీన పోతుగల్, 12 వ తేదీన విలాసాగర్, 13 వ తేదీన ఎల్లారెడ్డిపేట, 14 వ తేదీన పెద్దలింగాపూర్, 16 వ తేదీన నేరెళ్ల, 17 వ తేదీన తంగళ్ళపల్లి, 18 వ తేదీన కొదురుపాక, 20 వ తేదీన సిరిసిల్లలోని సుందరయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, 31వ తేదీన సిరిసిల్లలోని సుందరయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య ఆరోగ్య శిబిరాలు, పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత తెలిపారు.



## పార్లమెంటులో బిసి రిజర్వేషన్ బిల్లుకు పోరాడాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఈనెల 16 నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా బిల్లు ప్రవేశ పెట్టేలా కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలని బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్ ఎంపీని కోరారు. ఈమేరకు శుక్రవారం హైదారాబాద్ లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండి సతీష్ మాట్లాడుతూ విధ్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా పద్ధతి ప్రకారం బిసిలకు కనీసం 42 శాతం రిజర్వేషన్లు దక్కాల్సిందేనన్నారు. ఆదిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా కాంగ్రెస్ ఎంపీలు చొరవ చూపాలని కోరారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అవసరమైతే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ప్రైవేట్ బిల్లు పెడతామని ఇటీవల హైదారాబాద్ లో చెప్పారని ఆదిశగా కృషి చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన బీసీ కులాలను కేంద్ర ప్రభుత్వం కూడా ఓబీసీ జాబితాలో చేర్చేలా ఒత్తిడి పెంచేలా పార్లమెంట్లో ప్రస్తావించాలని ఎంపీని కోరారు. తెలంగాణలో 130 కులాలను రాష్ట్ర ప్రభుత్వం బీసీలుగా గుర్తించగా అందులో 90 కులాలు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఓబీసీ కేటగిరీలో ఉన్నాయన్నారు. మిగిలిన 40 కులాలు మాత్రం ఓబీసీ కేటగిరీలో లేకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొందని ఎంపీకి వివరించారు. ఈ 40 కులాలను ఓబీసీలో చేర్చాలని సతీష్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు.



## నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తాం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాకారంతో 66 డివిజన్లను అభివృద్ధి చేసే దిశగా మా పాలకవర్గం పని చేస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ లోని 1,2 డివిజన్ పరిదిలోని చంద్రపూర్ కాలనాలో శుక్రవారం రోజు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, గంథాలయ చైర్మన్ సత్తు మల్లేషం తో కలిసి ప్రారంభం చేశారు. ప్రభుత్వ నిర్ధేశం మేరకు నగరపాలక సంస్థ ద్వారా రూపొందించిన ప్రణాళిక ప్రకారం పారిశుధ్యం, అభివృద్ధి పనులను ప్రారంభం చేశారు. 99 రోజుల కార్యక్రమంలో బాగంగా 1,2 డివిజన్ల లో పరిసరాలను, ఖాళీ స్థలాలను శుభ్రం చేయడంతో పాటు, వివిధ రకాల వ్యర్థాలను తొలగించడం, డివిజన్లలోని డ్రైనేజీలలో సిల్టును తొలగించే పనులు చేపట్టారు. అనంతరం కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, మేయర్ కొలగాని శ్రీనివాస్ 1, 2 డివిజన్లలో 10 లక్షల నిధులతో డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రూపొందించిన షెడ్యూల్డ్ ప్రకారం మొదటి పది రోజుల పాటు 66 డివిజన్ల వాప్రజల సమస్యలు ఏమున్నా పది రోజుల్లో పరిష్కరించాలనే సంకల్పంతో ముందుకు పోతున్నామని తెలిపారు. అదనంగా డివిజన్ కు 50 మంది కార్మీకులను నియమించుకొని ప్రతి రోజు 5 డివిజన్ల చొప్పున పారిశుధ్య పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ డిఎంఏ షాహిద్ మసూద్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమీషనర్ దిలీప్ కుమార్, కార్పోరేటర్లు భారీ అపర్ణ జితేందర్, సాదవేణీ లావణ్య, పారిశుధ్య, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కార్మీకులు, ప్రజలు పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి మాజీ ఎంపిపి

**ప్రజాపక్షం/ముత్తారం :** ఈనెల 6 తేదీ నుండి 15 వరకు జరగనున్న ప్రజాపాలన ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ అత్తె చంద్రమౌళి అధ్యర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మొదటి రోజు గ్రామ పంచాయతీ భవనంలొ గల పాత, వినియోగంలోకి పనికిరాని వస్తువులు శుభ్రం చేయడం జరిగింది. అలాగే గ్రామస్థులు కూడా వారి వారి ఇండ్లలో గలా పనికి రాని వస్తువులను శుభ్రం చేసుకోవాలి అని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సల్లురి రాజు కుమార్,వార్డు సభ్యులు అగ్గిమల్ల కొమురయ్య, దోరి కోమలత,బూడిద ప్రసాద్,రామగిరి రాజబాబు, పంచాయితీ కార్యదర్శి దిలీప్ తో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజయ్య మృతి కాంగ్రెస్ తీరని లోటు

**ప్రజాపక్షం/ముత్తారం:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిటిసి మల్యాల రాజయ్య మృతి చెందడం బాధాకరమని, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం అన్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మృతి చెందడంతో పార్టీ నాయకులు దుఃఖ సంద్రంలో మునిగిపోయారు. ముత్తారం మండల కేంద్రానికి చెందిన మల్యాల రాజయ్య శుక్రవారం ఉదయం ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయి హార్ట్ స్ట్రోక్ తో మృతి చెందాడు. అందరితో కలివిడిగా ఉండే రాజయ్య మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ హోదాలోని నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** నేడు జిల్లాలో జరిగిన ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటర్ రెండవ సంవత్సరం మ్యాథమెటిక్స్ IIబి / జంతు శాస్త్రం/ చరిత్ర భాష పరీక్షలు జరిగాయని,ఈ పరీక్షకు (3885) మంది హాజరు కావాల్సి ఉండగా, (3828)మంది హాజరు కాగా,(57) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, నేడు 98 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పాత మెడికల్ ఎక్విప్‌మెట్ కొనుగోలుకు కొటేషన్ అందించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మార్చి 11 లోపు పాత మెడికల్ ఎక్విప్మెంట్ కొనుగోలుకు కొటేషన్ అందించాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ వైద్య విధాన పరిషత్ లో గల జిల్లా ఆసుపత్రిలో పనికిరాని పాత మెడికల్ ఎక్విప్మెంట్ విక్రయిస్తున్నామని ఆసక్తి గలవారు సీల్డ్ కొటేషన్ మార్చి 9 నుంచి 11 వరకు అందించాలని, వచ్చిన కొటేషన్లను మార్చి 13న సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఓపెన్ చేయడం జరుగుతుందని, మిగిలిన వివరాలు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లోని మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అన్ని పని దినాలలో పొందాలని, మిగిలిన వివరాలకు 8499061999, 9492457809 నెంబర్ నందు సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలో శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ కొలపాక రాధ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో, గ్రామ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం సర్పంచ్ పాలకవర్గం సభ్యులు, ఉద్యోగులు కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మైదం ప్రభాకర్, వార్డు సభ్యులు తోట లక్ష్మ ణ్, ముద్దం చిరంజీవి, తోట మల్లయ్య, బొడ్డు పల్లి రాజేష్, జ్యోతి, విజయ, లచ్చం, పంచాయతీ కార్యదర్శి రవి, శంకరయ్య, మల్లారెడ్డి, రాజేశం, కే. రాజేశం, గ్రామ పంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రజలుపాల్గొన్నారు.

# ప్రభుత్వ హైస్కూల్‌లో ఉచిత ఇఎన్‌టి ఆరోగ్య శిబిరం

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** ఐఎంఏ కరీంనగర్, ఏవోఐ కరీంనగర్ సంయుక్తంగా స్థానిక సుభాష్‌నగర్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఉచిత ఇఎన్‌టి ఆరోగ్య శిబిరం నిర్వహించారు. విధ్యార్థులకు ఉచిత ఇఎన్‌టి , ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. ఆడియోలజిస్టులు రాము, సందీప్ ఉచితంగా హియరింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరం ద్వారా 300 మందికిపైగా విధ్యార్థులు పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రతిమ మెడికల్ కాలేజి ఇఎన్‌టి విభాగాధిపతి డా.రమణాచారి ముఖ్య అతిధిగా హాజరై విధ్యార్థులు సెల్ ఫోన్లు, ఇయర్ ఫోన్లు అధికంగా ఉపయోగించకూడదని సూచించారు. ఐఎంఏ అధ్యక్షురాలు డా.ఎ.శైలజ విధ్యార్థులు చెవి, ముక్కు గొంతులో పెన్సిళ్లు, రబ్బర్లు వంటి వస్తువులు పెట్టకూడదని తెలిపారు. ఐఎంఏ కార్యదర్శి డా.ఎన్.మహేష్ బాబు ముక్కు గీయడం చేయకూడదని అవగాహన కల్పించారు. డా.రవికాంత్ వినికిడి లోపం గురించి వివరించారు. డా.సాయిప్రసాద్‌రావు విధ్యార్థులు కూల్ డ్రింక్స్ అధికంగా తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఓఐ అధ్యక్షుడు



సాయిప్రసాద్ రావు, కార్యదర్శి డా.రవికాంత్, ఐఎంఏ అధ్యక్షురాలు శైలజ, ఐఎంఏ కార్యదర్శి డా.ఎన్.మహేష్‌బాబుల డా.జాదవ్ రాజ్‌కుమార్, డా.ప్రశాంత్, డా.వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో గ్రామం అభివృద్ధిలో పయనించాలి

**ప్రజాపక్షం/వీణవంక:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామపంచాయతీ పాలకవర్గం ఆద్వర్యంలో కార్యాలయం మొత్తాన్ని శుభ్రం చేశారు. అంగన్‌వాడీ పిల్లలకు కొత్త డ్రెస్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండల కుమారస్వామి, ఉపసర్పంచ్ రవీందర్, వార్డు మెంబర్లు, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, గ్రామస్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ కుటుంబ వేడుకలో జిల్లా ప్రముఖుల సందడి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** గతంలో పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ గా పనిచేసి,జిల్లా ప్రజల మన్ననలు పొంది,ప్రస్తుతం గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న మంతెన లక్ష్మీ నారాయణశ్రీదేవి దంపతుల ప్రథమ పుత్రుడు చిరంజీవి అభినవ్‌డాక్టర్ ప్రణవిల వివాహ మహోత్సవం గురువారం హైదరాబాద్ లోని ఎస్.పి.ఆర్ శ్రీరస్తు కన్వెన్షన్‌లో అత్యంత వైభవంగా జరిగింది.ఈ వేడుకకు పెద్దపల్లి జిల్లా నుండి ప్రజా ప్రతినిధులు,వివిధ కుల సంఘాల నాయకులు మరియు ప్రభుత్వ అధికారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ముఖ్యంగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ప్రతినిధులు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.సంఘం జిల్లా అధ్యక్షులు భీమోజు సురేందర్ చారి,రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లోజు రాజు,అఖిల భారత మహాసభ రాష్ట్ర నాయకులు కౌలే జగన్నాధం,బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ కుందరం గణేష్ చారి,జిల్లా యూత్ అధ్యక్షులు గర్రెపల్లి క్రాంతి కుమార్, అనంతోజు బ్రహ్మాచారి,మాతృ సంఘం రాష్ట్ర నాయకులు లాల్కోట వెంకటాచారి, మదన్ మోహన్,మారోజు సుదర్శన్ చారి,వడకాపురం మురళి తదితరులు వధూవరులను ఆశీర్వదించి పుష్పగుచ్ఛాలను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లక్ష్మీ నారాయణ పెద్దపల్లిలో అదనపు కలెక్టర్ గా పనిచేసిన కాలంలో సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేవారని కొనియాడారు.ముఖ్యంగా విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ,వృత్తినిపుణుల పట్ల ఆయనకు ఉన్న గౌరవం మరువలేనివని గుర్తు చేసుకున్నారు.అధికారిక బాధ్యతలే కాకుండా,సామాజిక వర్గాలతో ఆయన కొనసాగించిన ఆత్మీయ అనుబంధం కారణంగానే తామంతా ఈ వేడుకకు హాజరైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత కలెక్టర్లు ముద్దసాని పురుషోత్తం రెడ్డి,సంకిడి ప్రభాకర్ రెడ్డిలతో పాటు వివిధ హోదాలో ఉన్న ప్రభుత్వ అధికారులు,ప్రజా ప్రతినిధులు మరియు లక్ష్మీ నారాయణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వివాహ వేదిక వద్ద కోలాహలం నెలకొంది.

## గట్టు మల్లికార్జున స్వామి అభివృద్ధికి సహకరిస్తా

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలం లోని మల్లన్నపల్లి గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవాలయ అభివృద్ధికి సహకరిస్తానని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ అన్నారు. శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవాలయ ప్రాంగణానికి వచ్చి రోడ్ మార్గము పరిసరాలను పరిశీలించారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఎంతో ఘన కీర్తి ఉన్న గట్టు మల్లికార్జున స్వామి దేవాలయానికి వెళ్లే మార్గం సరిగా లేదని, మొదటగా స్వామి వారి సన్నిధికి భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెళ్లే విధంగా సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని మల్లన్నపల్లి సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ ను ఆదేశించారు. అలాగే దేవాలయ ప్రాంగణం పరిసరాలు కూడా అభివృద్ధికి నోచుకోలేదని, దేవాలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణాన్ని చేపట్టి భక్తులు కూర్చునే విధంగా సిమెంట్



తో ఫ్లోరింగ్ చేయించాలన్నారు. ముఖ్యంగా భక్తులకు తాగునీటి సదుపాయాన్ని అందించాలన్నారు. అందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. అవసరమైతే దాతల సహాయాన్ని తీసుకొని భక్తులకు కావలసిన వసతులను కల్పించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లన్నపల్లి సర్పంచ్ పసునూటి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక

**ప్రజాపక్షం/చొప్పదండి:** పట్టణ సమస్యలు పరిష్కరించడానికి ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక దోహదపడుతుందని మున్సిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ వడ్లూరి




సరిత అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఆద్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వాటి వివరాలు చదివి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఒకటో వార్డు పరిధిలోని పశు వైద్యశాల వద్ద గల జివిపి పాయింట్లను శుభ్రపరిచి, చెత్త వేయకుండా ముగ్గు వేయించారు. వాటి సమీపంలో ఇంటి యజమానులకు బహిరంగ ప్రదేశంలో చెత్త వేయరాదని, తడి పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు మున్సిపాలిటీలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో అన్ని వార్డుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్యం, వేసవికాలంలో నీటి ఎద్దడి, ప్రజలకు ఆరోగ్యం పట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పెరమాండ్ల మానస, కౌన్సిలర్లు కొట్టె సునీత, కనుమల్ల రాజశేఖర్, వడ్లూరి అనూష, సురేష్, రాజన్నల రాజు, గుర్రం రాజేందర్ రెడ్డి, గుర్రం సుజిత్‌రెడ్డి, పిట్టల వెంకటేస్, జిట్ట మంగ, మేనేజర్ ప్రశాంత్ కుమార్, మెప్మా టిఎంసి అనిత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఎస్. శివాని, ఇంచార్జి సానిటరీ ఇన్స్‌పెక్టర్ అంజయ్య, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ చిల్లర రాజకీయాలను నమ్మి మోసపోవద్దు

**ప్రజాపక్షం/గంగాధర:** మాజీ మంత్రి, సిద్దపేట ఎమ్మెల్యే హరీష్‌రావు చొప్పదండి నియోజకవర్గంలో చిచ్చు పెట్టడానికి వస్తున్నాడని, కెటిఆర్, హరీష్‌రావు రాష్ట్రంలో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చిల్లర రాజకీయాలు చేయడంలో నంబర్‌వన్ అని చొప్పదండి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి దుయ్యబట్టారు. ఆయన మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని హితవు పలికారు. గంగాధర మండలం మధురానగర్‌లోని ఎమ్మెల్యే ప్రజాకార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్, హరీష్‌రావు నియోజకవర్గంలోని కొండపోచమ్మ, మల్లన్న సాగర్ రిజర్వాయర్ల కోసం చొప్పదండ నియోజకవర్గం రైతులను బలి చేశారన్నారు. ఇక్కడి రైతుల భూములను లాక్కొని మోసం చేశారని గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి చొప్పదండి నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులకు ఒక్క రూపాయి సైతం కేటాయించలేదని ఎద్దేవా చేశారు. చొప్పదండి నియోజకవర్గానికి ఏం ఒరగబెట్టారో హరీష్ రావు చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న వరద కాలువ ఓటిలు, నారాయణపూర్ రిజర్వా



యర్, ఎడమ కాలువలను పూర్తి చేయలేదన్నారు. సాగు నీటి ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కేటాయించకుండా ఏ మొహం పెట్టుకుని నియోజకవర్గానికి వస్తున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలకు కేటాయించిన నిధుల్లో కనీసం 10 శాతం నిధులను చొప్పదండి నియోజకవర్గానికి కేటాయించలేదని ఎద్దేవా చేశారు. గంగాధర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, హరీష్, వన్నెల రమణారెడ్డి, నారాయణ, మహేష్, బొమ్మరవేని తిరుపతి, బోయిని ఎల్లేష్, శ్రీనివాస్ గౌడ్, చందు, అధ్యక్షుడు ముద్దం నగేష్, రాజేందర్, సుఫీన్ యాదవ్, మ్యాక వినోద్, వంగల శ్రీనివాస్, మనీష్ తదితరులున్నారు.

## జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో తుమ్మ ఇషాన్ ప్రతిభ

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరానికి చెందిన తుమ్మ ఇషాన్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మార్చి 02న కరీంనగర్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్చరీ పోటీల్లో ఇషాన్ ఈ ఘనత సాధించాడు. కరీంనగర్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తుమ్మ ప్రవీణ్ కుమార్ తనయుడైన తుమ్మ ఇషాన్, ఈ పోటీల్లో అండర్13 కాంపౌండ్ విభాగంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. తన గురి తప్పని నైపుణ్యంతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన ఇషాన్, ఈ నెల 8వ తేదీన (మార్చి 08, 2026) హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు.

### రాష్ట్రస్థాయి ఆర్చెరీ ఛాంపియన్‌షిప్ పోటీలకు పారమిత విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ఇటీవల కరీంనగర్ జిల్లా అర్చెరీ అసోసియేషన్ ఆద్వర్యంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 13 అర్చెరీ చాంపియన్‌షిప్ పోటీలలో పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 5వ తరగతి విధ్యార్థి తుమ్మ ఇషాన్, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి అర్చెరీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశల డైరెక్టర్ కె.హన్మంతరావు తెలిపారు. ఈ నెల 8న హైదరాబాదులోని పటాన్ చెరులో జరగబోయే తెలంగాణ రాష్ట్ర అర్చెరీ అసోసియేషన్ ఆద్వర్యంలో జరగనున్న అర్చెరీ అండర్ 13 బాలుర చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొననున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఇషాన్‌ను పారమిత విద్యాసంస్థల అధినేత డా.ఇ ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, రాకేష్, అనూకర్‌రావు, వినోద్ రావు, వియుయం ప్రసాద్, హన్మంతరావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, కో ఆర్డినేటర్ నిఖిత, పిఇటిలు యస్.రాజు, జె.శ్రీనివాస్‌లు అభినందించారు.

## లయన్స్ ఆసుపత్రి సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** లయన్స్ ఆసుపత్రి సేవలు అభినందనీయమని మార్గదర్శి ఎండి శైలజ అన్నారు. కొత్తపెల్లి మండలం రేకుర్తి లయన్స్ ఆసుపత్రిలో శుక్రవారం రేటినా మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్‌ను చైర్మన్ కొండా వేణు మూర్తితో కలిసి ప్రారంబించారు. ఈ సంధర్భంగా శైలజ మాట్లాడుతూ నూతన రేటినా మాడ్యులర్‌తో రోగులకు మెరుగైన చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ప్రతి వార్డును సందర్శించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పేదలకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి సమస్యను గుర్తించి చికిత్స అందించడం పలువురికి మంచి చేస్తుందన్నారు. లయన్స్ ఆసుపత్రికి తాము అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. మంచి పనుల్లో భాగం పంచుకుంటే మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ చిదురు సురేష్, లయన్ ప్రకాష్ వోల్గా, లయన్ డాక్టర్ మురళీధర్‌రావు, లయన్ కోల అన్నారెడ్డి, లయన్ ముక్క శరత్ కృష్ణ తదితరులున్నారు.

## శుభకార్యాలకు హాజరైన వొడితల ప్రణవ్

**ప్రజాపక్షం/వీణవంక:** వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన పలు వివాహాది శుభాకార్యాలకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఊరూరా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక



**ప్రజాపక్షం/ధర్మపురి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమం శుక్రవారం జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపాలిటీ తోపాటు గ్రామగ్రామాన ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ఈనెల 6 నుండి జూన్ 12 వరకు 99 రోజులపాటు జరుగనుంది.కార్యక్రమంలో భాగంగా ధర్మపురి మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చైర్ పర్సన్ నాగ లక్ష్మి, వైస్ చైర్మన్ ఐ.రామయ్య,వార్డు సభ్యులు ఏ.వేణుగోపాల్ లు కార్యక్రమాన్ని ప్రారంభించి స్వచ్ఛతకై శ్రీకారం చుట్టారు.అదేవిధంగా మండలంలోని రాయపట్నం గ్రామంలో సర్పంచ్ రాందేని మొగిలి, ఉపసర్పంచ్ చిలుక రామన్న, దోనూర్ గ్రామంలో ఎంఇఓ సీతాలక్ష్మి ఆధ్వర్యంలో సర్పంచ్ దాసరి పురుషోత్తం, ఉపసర్పంచ్ చిరుత ప్రభాకర్,ఏఎంసి వైస్ చైర్మన్ సంగ నర్సింహులు,గ్రామ కార్యదర్శి ముత్యం,కమలాపూర్ గ్రామంలో సర్పంచ్ కుమ్మరి తిరుపతి, కార్యదర్శి కటకం లక్ష్మ ణ్,జైనాలో సర్పంచ్ గడ్డి లక్ష్మీ తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతం గా అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ ప్రగతిలో వేగం పెంచాలని తెలిపారు.

## మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళ పోరాట దినం జరపాలి

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళ పోరాట దినమును జరుపుకొనుటకై ప్రగతిశీల మహిళా సంఘం (శ్రీ విముక్తి తెలంగాణ రాష్ట్ర జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఏ.ఐ.ఎఫ్.టి.యు లక్ష్మక్క ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర రైతు కూలి సంఘం సభ్యులు కరుణాకర్ పాల్గొని పిలుపునిస్తున్నాం అని అన్నారు. 116 సంవత్సరాలు అయింది ఆనాటి పెట్టుబడి దారి వ్యవస్థలో కార్మికులు 14 నుండి 18 గంటల వెట్టి చాకిరిలో మునిగిపోయేవారు కావున ఇప్పుడు స్త్రీ పురుషుల సమానంకై పోరాడుదాం అని పిలుపు మేరకు మార్చి 8న విజయవంతం చేయాలని కోరడమైంది. ఇటి కార్యక్రమంలో పాల్గొన్న మహిళ బీడీ కార్మికులు పరవేణి సరోజ, సంధ్య, కదారి రాణి, జగ్గ మహేశ్వరి,జికూరి భాగ్య, కడార్ల రేవతి, జైనాపురం స్వప్న, బూర శంకు, నీలం స్రవంతి,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** విద్యార్థులు మంచిగా చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి అన్నారు. శుక్రవారం గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల గీతా నగర్ బాలికల పాఠశాల, శివనగర్ కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పట్టణంలో దాదాపు 1056 మంది విద్యార్థులకు స్థానిక శాసనసభ్యులు కేటీఆర్ పరీక్ష ప్యాడ్ లను మరియు పెన్నులను అందించేలా అన్ని ఏర్పాట్లు చేశారని అన్నారు. విద్యార్థుల జీవితంలో పదవ తరగతి వారి భవిష్యత్తును నిర్ణయించేదిగా ఉంటుందని ఎవరూ కూడ ఉన్న ఈ కాస్త సమయాన్ని వృధా చేయకుండా ఆటలు, పండగలు, ఫోన్ చూడడం వంటి మొదలగు అన్ని విషయాలను పక్కనపెట్టి చదువు మీద శ్రద్ధతో బాగా చదివి అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ సభ్యులు వేముల రాములు,దార్నం అరుణ లక్ష్మీనారాయణ, బుర్ర నారాయణ గౌడ్, కూర భాగ్యలక్ష్మి దేవరాజు, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీ నారాయణ ,గారు, నాయకులు సబ్బని హరీష్, ఎం.డి సత్తర్, మ్యాన రవి, అన్నారం శ్రీనివాస్, గడ్డం లత భాస్కర్, షేక్ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

## పజా పాలన–ప్రగతి ప్రణాళికపై ప్రత్యేక డ్రైవ్



**ప్రజాపక్షం/కోరుట్ల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోరుట్లలో మార్చి 6 నుండి మార్చి 15 వరకు 10 రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నడికట్ల సందీప్ తెలిపారు.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం, సంస్థాగత నిర్వహణ, రికార్డుల నిర్వహణ మరియు పరిపాలనా సామర్థ్యంపై దృష్టి సారించనుంది. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రిన్సిపల్ నడికట్ల సందీప్ మాట్లాడుతూ, "ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అధ్యాపకులు మర్షియు విద్యార్థులు అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు.ప్రగతి ప్రణాళికలో భాగంగా కళాశాలలో వివిధ విభాగాల సమన్వయంతో శుభ్రత కార్యక్రమాలు,రికార్డుల సక్రమ నిర్వహణ, పరిపాలనా విధానాల మెరుగుదల, మరియు విద్యార్థులలో అవగాహన పెంపు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నడికట్ల సందీప్, వైస్ ప్రిన్సిపాల్ ముత్యంరెడ్డి,ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాజ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది అందరూ కలిసి పనిచేస్తే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## మహిళల అభ్యున్నతికి తోడ్పాటు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మహిళల అభ్యున్నతికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి తోడ్పాటు అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో నూతనంగా నిర్మించి గ్రామ మహిళా సమాఖ్య సంఘాల భవనాలకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూమి పూజ చేశారు. గ్రామాలలో మహిళ సంఘాల సమావేశాలకు నూతనంగా నిర్మించే భవనాలు ఎంతో ఉపయోగపడతాయని త్వరతిగతిన పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మణ్, ఎమ్మార్వో శ్రీనివాస్,ఎంపీడీవో శ్రీకాంత్,మాజీ జెడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు డీలర్ మల్లయ్య శరత్, లింగస్వామి, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ,మహిళ సంఘాల సభ్యురాలు,తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల కలెక్టరేట్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం




**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జగిత్యాల కలెక్టరేట్లో ఉచిత మెగా వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి నిపుణులైన వైద్యులు సేవలందించారు. ఆసుపత్రి జనరల్ సర్జన్ డా. అబ్దుల్ వారిస్ ఉస్మాని (తాహ), గైనకాలజిస్ట్ డా. శ్రీనయన, ఫిజియోథెరపిస్ట్ డా. అనిల్, డైటీషియన్ డా.మమత శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు.అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో వంటి కీలక పరీక్షలు నిర్వహించి తక్షణ వ్యాధి నిర్ధారణ చేశారు. వ్యాధులు గుర్తించిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని వారు తెలిపారు. పండగలు, సెలవులు అనే తేడా లేకుండా 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు మెడికవర్ హాస్పిటల్ లో అందుబాటులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే రోగులను కరీంనగర్ లోని మెడికవర్ ఆసుపత్రికి తరలించి ఆధునిక వైద్యం అందిస్తామని మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. హెచ్ఆర్ మేనేజర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు సిబ్బంది కోసం ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించిన మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ వైద్య శిబిరంలో జగిత్యాల డిఆర్డిఓ ఎం.రఘువరన్, అడిషనల్ డిఆర్డిఓ మధన్మోహన్, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, సాయితేజ,పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అన్న ప్రసన్న కార్యక్రమం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** శుక్రవారం మెట్పల్లి పట్టణంలోని 12వ వార్డు అంగన్వాడి కేంద్రంలో దీన్ దయాల్ నగర్ "అన్న ప్రసన్న" కార్యక్రమం నిర్వహించబడింది.సి .బి .ఈవెంట్ భాగంగా సామాజిక వేడుకలలో భాగంగా ఈ అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు నెలల పిల్లల నుండి మూడు సంవత్సరాల పిల్లల వరకు టిహెచ్ఆర్ గుడ్లు మరియు బాల అమృతం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 12వ వార్డ్ కౌన్సిలర్ సుమయ్య తబస్సుం. హాజరైనారు ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు చిన్నపిల్లలు పిల్లల తల్లులు హాజరయ్యారు. అంగన్వాడి సూపర్వైజర్ ప్రతిభ, గంగాలక్ష్మి, మాధవి, రజిత, అనిత, తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల పట్టణ ఇన్స్‌పెక్టర్‌గా శ్రీనివాస్ పదవి బాధ్యతలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా శుక్రవారం శ్రీనివాస్ పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష పాడ్స్, పెన్నులు పంపిణీ

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాయబోవు విద్యార్థిని,విద్యార్థులకు ప్యాడ్లు,పెన్నులు పంపిణీ చేసిన ముదిరాజ్ మండల అధ్యక్షుడు కోమల్ల జలంధర్. ఈ సందర్భంగా జలంధర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థిని,విద్యార్థులు,విజయవంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు గౌరవప్రదంగా ఈ విజయాన్ని అందించాలని తెలిపారు.ఎక్కడ ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జి స్కిల్స్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ యజమాని ముంజంపల్లి రమేష్,వార్డు సభ్యులు సంగేమ్ కళ్యాణ్ కుమార్, ఐతరవేని వెంకటేష్,అధ్యాపక బృందం విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 7 శనివారం రోజున ఉదయం 9 గంటల నుండి ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ వై శ్రీకాంత్ తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక వైద్య నిపుణులైన జనరల్ మెడిసిన్ ,స్త్రీ వైద్య నిపుణులు ,ఎముకల వైద్యనిపుణులు ,దంత వైద్యాన్ని పనులు దంత వైద్య నిపుణులు ,పిల్లల వైద్య నిపుణులచే ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య ఆరోగ్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు.ఈ ఉచిత వైద్య సేవలను మండలంలోని గ్రామ ప్రజలు,మహిళ సంఘాల సభ్యులు,వృద్ధులు పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వై శ్రీకాంత్ మండల ప్రజలను కోరారు.

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం 99 డేస్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టి పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రపరిచారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.ఎస్. ఎస్ వర ప్రసాద్, ఎస్ఐ జి. నవీన్ కుమార్, మండల వైద్యాధికారి వనజ, ఎంపీడీవో చిప్ప గణేష్, సర్పంచ్ బద్దం గోపి, ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్, ఏపీఎం శంకర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు,వార్డు మెంబర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,పంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ ఉప కేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తిరుమలాపూర్ 33 కెవి ఫీడర్ పరిధిలో శనివారం చెట్ల కొమ్మలు తొలగించనున్నందున విద్యుత్ సరఫరా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిలిపి వేయ పడుతుందని రామన్నపేట విద్యుత్ శ్రీనివాస్ తెలిపారు. దీని వలన మల్యాల మండలం రాంపూర్ ఉప కేంద్రం పరిధిలో రాంపూర్, ఓబులాపూర్, ఒడ్డెర కాలనీ గ్రామాలకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించగలరనీ ఆయన తెలిపారు.

## బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్రీనివాస్ బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని బొమ్మేన రోడ్డుపై విధుల్లో భాగంగా మోటార్ సైకిల్‌పై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా బైక్ నియంత్రణ కోల్పోవడంతో శ్రీనివాస్ కిందపడిపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది శ్రీనివాస్‌కు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించి బాధితుడికి తక్షణ వైద్య సహాయం అందించినట్లు 108 ఈఎంటీ జె. రమేష్ తెలిపారు. పైలట్ ఎం. గంగాధర్, స్థానికులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది

**ప్రజాపక్షం / కౌటాల :** అంబులెన్స్‌లో దొరికిన నగదుతో కూడిన పర్సును బాధితులకు అందజేసి 108 సిబ్బంది తమ నిజాయితీని చాటుకున్నారు. కౌటాల మండలం బాలేపల్లి గ్రామానికి చెందిన జూండీ నాందేవ్ అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు గురువారం రాత్రి 108 అంబులెన్స్‌లో సిర్పూర్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో నాందేవ్ కుటుంబ సభ్యుల పర్సు అంబులెన్స్‌లోనే పడిపోయింది. శుక్రవారం ఉదయం అంబులెన్స్‌ను శుభ్రం చేస్తుండగా ఈఎంటి విజయ్, పైలట్ సురేష్‌లకు పర్సు లభించింది. వెంటనే వారు ఈ విషయాన్ని జిల్లా ఇన్చార్జి మెరుగు నరేష్ యాదవ్‌కు తెలియజేశారు. మేరకు నాందేవ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పర్సును భద్రంగా అందజేశారు. నిజాయితీగా వ్యవహరించిన విజయ్, సురేష్‌లను జిల్లా ఇన్చార్జి నరేష్ యాదవ్‌తో పాటు పలువురు అభినందించారు.

## ట్రాక్టర్ దొంగతనంపై సమాచారం ఇస్తే బహుమతి

**ప్రజాపక్షం / కౌటాల :** దొంగతనానికి గురైన ట్రాక్టర్, ట్రైలర్ గురించి సమాచారం అందించిన వారికి తగిన బహుమతి అందజేస్తామని కౌటాల సర్కిల్ ఇన్ స్పెక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. మహీంద్రా ట్రాక్టర్ నంబర్ టీఎస్ 20టీ 9565, ట్రైలర్ నంబర్ టీఎస్ 20టీ 9902 దొంగతనానికి గురైనట్లు ఆయన వెల్లడించారు. ఈ వాహనాల గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. సమాచారం తెలిసిన వారు 8712670504, 871 267 0512, 8712670542 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. వివరాలు అందించిన వారి పేర్లను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు. దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.కౌటాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## పాడి పశువుల ఆరోగ్య సంరక్షణకు వైద్య శిబిరాలు



**ప్రజాపక్షం / జన్నారం :** పాడి పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని మండల పశు వైద్య అధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ తెలిపారు. జన్నారం మండలంలోని రోటీగూడ గ్రామపంచాయతీ పరిధిలో పశు గణాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పశు సంవర్ధక పశు వైద్య శాఖ జన్నారం మండలం ఆధ్వర్యంలో శుక్రవారం పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశువుల ఆరోగ్య సమస్యలపై వెంటనే పశు వైద్యశాఖను సంప్రదించాలని సూచించారు. ఈ శిబిరంలో పాడి పశువులకు కలిగే గర్భకోశ సంబంధిత వ్యాధుల నివారణ చికిత్సలు ఉచితంగా అందించి అవసరమైన మందులు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఫీడ్ బజార్ వారి సహకారంతో పాడి పశువులకు ఉచితంగా దాణా పంపిణీ చేశారు. రైతుల పాడి పశువుల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బంది పశువుల పరిస్థితిని పరిశీలించి తగిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాల్ ఉపసర్పంచ్ సత్తయ్య జిల్లా గోపాల మిత్ర సూపర్వైజర్ రవి రమేష్ రాజన్న వైద్య సిబ్బంది కిషన్ సాగర్ లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఉమేష్ ఫీడ్ బజార్ మేనేజర్ రాజేందర్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా మహిళా దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం / మందమర్రి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా మందమర్రిలోని సిఈఆర్ క్లబ్‌లో శుక్రవారం మహిళలకు వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్. శ్రీవాణి రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలందరికీ ముందస్తుగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా బాంబ్ ఇన్ బ్లాస్ట్, త్రో బాల్ వంటి ఆటలతో పాటు గ్రూప్ డాన్సులు, స్కిట్‌లు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. మందమర్రి ఏరియాకు చెందిన సుమారు 200 మంది మహిళలు, సింగరేణి సంస్థలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.కమ్యూనికేషన్ సెల్ సేవాసమితి కోఆర్డినేటింగ్ ఆఫీసర్ మహిళా ఉద్యోగులు, సేవా సభ్యులు పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణకే గ్యాస్ సిలిండర్ల పంపిణీ



**ప్రజాపక్షం/తిర్యాని :** అడవుల సంరక్షణలో భాగంగా గిరిజన కుటుంబాలు వంట కోసం కట్టెలపై ఆధారపడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని ఏదులపాడు గ్రామ పంచాయతీలో అడవి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గిరిజన కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి ప్రాంతాల్లో నివసించే ప్రజలు వంట కట్టెల కోసం అడవులపై ఆధారపడటం వల్ల పర్యావరణానికి నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. గిరిజన కుటుంబాలకు వంట సౌకర్యం కల్పించడంతో పాటు అడవులను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ పంపిణీ ద్వారా గిరిజనులు కట్టెల కోసం అడవిలోకి వెళ్లే అవసరం తగ్గి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని చెప్పారు. ఏదులపాడు గ్రామంలో అడవి శాఖ తరపున మొత్తం 21 కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ 2 శ్రీనివాస్, జి. నరేష్, సి.హెచ్. మనోహర్, ఎఫ్‌బిఒ జి. శ్రీలేఖ, గ్రామ సర్పంచ్ పార్వతి అంబారక్, మోతీరాం పటేల్, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి



**ప్రజాపక్షం / తిర్యాణి :** మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణతో, సమన్వయంతో పనిచేయాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీర శ్యాం నాయక్ పిలుపునిచ్చారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రామచందర్ నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్యాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీలో ఉంటూ మోసపూరిత చర్యలకు పాల్పడిన వారిని ఇప్పటికే బహిష్కరించామని ఆయన వెల్లడించారు. కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అర్హులైన పేదలకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే నూతన మండల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆవునూరి రవి, దుర్గం సోమయ్య పాల్గొన్నారు.

## వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన

**ప్రజాపక్షం / తిర్యాణి :** గ్రామాల్లో పంచాయతీరాజ్ చట్టాల అమలు, గ్రామసభల నిర్వహణలో వార్డు సభ్యులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని మండల పరిషత్ కార్యాలయ అధికారి వేముల మల్లేష్ సూచించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వార్డు సభ్యులకు పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 80 మంది వార్డు సభ్యులకు రీసోర్స్ పర్సన్ల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావడానికి గ్రామసభలు కీలకమని మల్లేష్ అన్నారు. పంచాయతీ వ్యవస్థలో అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర, గ్రామస్థులతో సమన్వయం తదితర అంశాలపై శిక్షణలో వివరంగా అవగాహన కల్పించారు. విధులను సమర్థవంతంగా నిర్వహించగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## నిధుల కోసం మంత్రి జూపల్లికి విన్నపం

**ప్రజాపక్షం/ఆదిలాబాద్అర్బన్:** ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావును మున్సిపల్ చైర్‌పర్సన్ అండారి అనూష, కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం స్థానిక పెన్‌గంగా వసతి గృహం వద్ద ఆయనకు మున్సిపల్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఆదిలాబాద్ మున్సిపల్ అభివృద్ధి కోసం 100 కోట్లను మంజూరు చెయ్యాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బట్టిసావర్గాం మహిళలు

**ప్రజాపక్షం/మావల:** మావల మండలంలోని బట్టి సావర్గాం గ్రామ పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో బట్టిసావర్గాం గ్రామ సర్పంచ్ అడ్వకేట్ శ్రీనివాస్‌రెడ్డి, గణపతిరెడ్డి, వెంకట రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరేందుకు తరలివచ్చిన బట్టిసావర్గాం, దుబ్బగూడ మహిళలకు పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. గ్రామ పార్టీ పెద్దల ఆధ్వర్యంలో బట్టి సావర్గాంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమవుతుందన్నారు.

## ఘనంగా వీడ్కోలు సమావేశం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మహ్మద్‌నగర్ మండలంలోని బూర్గుల్ గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయులకు, తమ తల్లితండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివిన వారే ఉన్న లక్ష్యాలను చేరుకుని బంగారు భవిష్యత్తును పొందుతారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో 99 రోజుల ప్రగతి ప్రణాళిక



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణను కాగజ్ నగర్ పట్టణంలోని 18వ వార్డులో శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ కొత్తపల్లి అనిత, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి కలిసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ఈ ప్రత్యేక ప్రణాళిక నిరంతరాయంగా కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. ఈ 99 రోజులు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిస్తారని, ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రగతి ప్రణాళికను విజయవంతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కచ్చకాయల జ్యోతి, వసిమున్నిసా, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మహంకాళి జాతరకు కలెక్టర్‌కు ఆహ్వానం

**ప్రజాపక్షం / రెబ్బెన:** మహంకాళి జాతర మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కె హరితకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలోని కనకదుర్గా దేవి స్వయంభూ మహంకాళి దేవస్థానంలో నిర్వహించే జాతరకు రావాలని ఆలయ ప్రధాన అర్చకులు దేవర వినోద్ శుక్రవారం కలెక్టర్ ను కలిసి కోరారు. ఏప్రిల్ 2వ తేదీన శివపార్వతుల కళ్యాణం, 3వ తేదీన శ్రీ మహంకాళి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా వారు వివరించారు. జాతరలో భాగంగా రథోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలకు ఆసిఫాబాద్ జిల్లాతో పాటు మంచిర్యాల జిల్లా, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దేవర వినోద్ పాల్గొన్నారు.

## డిడిఒలు పరిధిలోని సిపిఎస్ ఉద్యోగుల వివరాలను పూర్తి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలోని డీడీవోలు అందరూ తమ పరిధిలో గల సీపీఎస్ ఉద్యోగుల డెమోగ్రాఫిక్ డిటైల్స్ లో మొబైల్ నెంబర్,పాన్ కార్డ్ నెంబర్ బ్యాంకు అకౌంట్,నామినీన వివరాలు మొదటగునవి సరిగా ఉన్నయా లేదా సరిచూసుకుని డీడీవో లాగిన్ లోనే ఈ వెసులుబాటు ను కల్పించారని నిర్మల్ జిల్లా డీటీఓ సరోజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు..పై వివరాల కోసం సంబంధిత డీడీఓ సిఆర్ఏ ఎన్.ఎస్.డిఎల్ ప్రోటీన్ సైట్ లోకి వెళ్లి యూసర్ ఐడి బాక్స్ లో డీడీఓ రిజిస్ట్రేషన్ నంబర్ తో రెండు సున్నాలు(00)జోడించి పాస్ వర్డ్ రీసెట్ చేసుకోవాలని కోరారు.ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత ట్రెజరీ అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు.

## బోథ్ సూపర్డెంట్ పై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నేరడిగొండ :** రెక్క ఆడితే డొక్కా నిండని బోథ్ నియోజకవర్గం ఈ అపత్కాల పరిస్థితులలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్చార్జి మంత్రి మొట్టమొదటిసారిగా రాష్ట్రం లోనే బోథ్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన నియోగ నియోజకవర్గానికి ఆరోగ్యరీత్యా అన్ని రకాలుగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పరమైన వైద్య సదుపాయాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తుందని అన్నారు.అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం ఈ సమావేశాన్ని ఉద్దేశించి బోథ్ ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చిన డాక్టర్లు పెంచిన ఆసుపత్రి పడకలు నామమాత్రమైన పనులతో గత కొన్ని సంవత్సరాలుగా బోథ్ ఏరియా ఆసుపత్రి నడుస్తున్న తీరును చూస్తే నియోజకవర్గంలో ఎటువంటి ఆరోగ్య పరిస్థితులు అనుభవిస్తున్నారో ప్రతి ఒక్కరికి అర్థం అవుతుందని బోథ్ ఎమ్మెల్యే ఇన్చార్జి మంత్రి ముందర సమస్యలను ఏకరు పెట్టారు.మొట్టమొదిసారిగా ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన 90 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానన్ని నేరడిగొండలో నిర్వహించడం అందరికీ అభినందనీయమే కానీ ఆదివాసి గరిజన నియోజకవర్గం లో ఏరియా ఆసుపత్రిలో సూపర్డెంట్ విధులు నిర్వహించకపోవడం ప్రజల ఆరో గ్యం పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో మంత్రి తెలుసుకోవాలి కలెక్టర్ చర్య తీసుకోవాలని ఈ వేది క ద్వారా సూచించారు.నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన విద్య అందించాలి

బైంసా మున్సిపల్ చైర్మన్దత్తాత్రి

**ప్రజాపక్షం/బైంసా :** పిల్లలకు ఉపాధ్యాయుల విలువలతో కూడిన విద్య అందించి,విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి అన్నారు శుక్రవారం పట్టణంలోని సంస్కార్ పాఠశాలలో పాదపూజ కార్యక్రమానికి హాజరై,మాట్లాడారు.ప్రతి ఉపాధ్యాయులు పిల్లలపై శ్రద్ధ కనబరిచి వారికి ఆసక్తి ఉన్న రంగాలలో మరింత రాణించే విధంగా ప్రోత్సహించాలని అలాగే విద్యార్థులు సైతం చదువుపై దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించి పోషకుల పేరుని నిలబెట్టాలన్నారు.

## నారాయణ ప్రయివేట్ పాఠశాల వద్ద బివిపిపీ నాయకుల నిరసన

**ప్రజాపక్షం/బైంసా :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మహిషా శాఖ ఆధ్వర్యంలో స్థానిక నారాయణ పాఠశాలలో గత కొన్ని రోజుల నుండి 9వ తరగతి విద్యార్థులకు 10వ తరగతి అడుగు పెట్టక ముందే విద్యార్థుల తల్లిదండ్రులు నుండి 50 శాతం 10వ తరగతికి ఫీజ్‌ను వసూలు చేయడం జరుగుతుంది అని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ కు తెలియజేయడం జరిగింది.ఆయన అ విషయం పట్టించుకోకపోవడంతో ఏబీవీపీ నాయకులకు చెప్పడం జరిగింది.ఈ విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు నారాయన పాఠశాల వద్ద ఆందోళన చేపట్టడం జరిగింది.ఈ విషయం ఎం.ఈ.ఓ తెలిసిన వెంటనే పాఠశాలకు రావడం జరిగింది.ఈ విషయం పై ఏబీవీపీ నాయకుడు స్టేట్ హాస్టల్ కో కన్వీనర్ గంగప్రసాద్ మాట్లాడుతూ ఈ పేద ధనిక విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు.అలాగే రైతు కుటుంబాల నుండి విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటే అలాగే 9వ తరగతి పూర్తి కాక ముందే 10వ తరగతి చదువు కోసం ముందుగా పాఠశాల




లో 50 శాతం 10 వ తరగతి ఫీజ్ ను చెల్లించాలి అని విద్యార్థుల తల్లిదండ్రులు కి ఇబ్బంది పెట్టడం జరుగుతుంది.అని ఈ పాఠశాల పై ఎం.ఈ.ఓ వెంటనే చర్యలు తీసుకోవాలని అలాగే 18 ముందుగా తీసుకున్న ఫీజ్ ను వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి ఇవ్వాలని అలాగే పాఠశాలకు ఫోకస్ నోటీస్ ఎం.ఈ.ఓ జారీ చేయాలి అని అలాగే ఈ విషయం పై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఏబీవీపీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలియజేయడం జరిగింది.

## డా.తుమ్మల దేవరావ్‌కు బి ఎన్ శాస్త్రి ధర్మనిధి పురస్కారం..!

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ప్రతి ఏటా భాషా,సాహిత్యం,చరిత్ర రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్నావారికి ధర్మనిధి పురస్కారాలు అందజేస్తుంది.ఈ ఏటా ప్రకటించిన పురస్కారాల్లో డా.బి.ఎన్ శాస్త్రి ధర్మనిధి పురస్కారం నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన తుమ్మల దేవరావ్ వరించింది. డా.తుమ్మల దేవరావ్ గత 25 సంవత్సరాలుగా చరిత్రను పరిశోదిస్తూ 17 కన్నడ,తెలుగు,ఉర్దూ,ఫారసి శాసనాలను వెలుగులోకి తెచ్చారు.మరుగున పడిన ఎన్నో శిల్ప ప్రతిమలను వెలుగులోకి తెచ్చారు.వేల సంవత్సరాల నిర్మల్ జిల్లా చరిత్రను వ్యసాల రూపంలో ప్రకటించారు.అనేక భౌద్ధ,జైన,శాతవాహన,రాష్ట్రకూట,కళ్యాణి చాలుక్యుల,కాకతీయుల విగ్రహాలు,చిహ్నాలు,క్షేత్రాలు గుర్తించారు.నిర్మల్ జిల్లా సమగ్ర సర్వస్వానికి సంపాదకత్వం వహించారు.రాంజీగొండు చరిత్రను వెలుగులోకి తెచ్చారు.వీరి కృషికి తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం,భాషా సాంస్కృతిక శాఖ ఉత్తమ పరిశోధన పురస్కారం సినారే పురస్కారం,సినారే కళాపీఠం జాతీయ పురస్కారం,రంజని కుందుర్తి,ఎక్స్‌రే,కవిసంధ్య, గుఱ్ఱం జాషువా,విమల శాంతి,గిడుగు రామామూర్తి పంతులు జాతీయ అవార్డులను అందుకున్నారు.ఈ నెల 17వ తేదీన తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాగణంలోని



డా.దేవులపల్లి రామానుజ రావు కళా మందిరంలో సాయంత్రం 5.30 నిముషాలకు అవార్డు ప్రధానం చేయనున్నారు.ఎల్లూరి శివారెడ్డి,డా.చెన్నయ్య ప్రధాన కార్యదర్శి 5వేల నగదు, జ్ఞాపిక, శాలువ,ప్రశాంసాపత్రం అందజేయనున్నారు.నిర్మల్ సా హితీ మిత్రులు పురస్కారం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసిన మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా ఇటీవల బాధ్యతీలు స్వీకరించిన వెంకటేశ్వర్లు ని మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య,వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కు పుష్పగుచ్చ అందజేసి,శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లాకు కొత్తగా బదిలీపై వచ్చిన ఆయనను కలిసి పట్టణంలోని తాజా పరిస్థితులను వివరించారు.అనంతరం మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ మాట్లాడుతూ,నిర్మల్ పట్టణ సమస్యల పరిష్కారం,నిరంతర అభివృద్ధి కోసం జిల్లా యంత్రాంగం తరపున తమకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలని అదనపు కలెక్టర్ ను



కోరారు మున్సిపాలిటీ,జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని చర్చించారు.సానుకూలంగా స్పందించిన అనదపు కలెక్టర్,పట్టణ ప్రగతి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం ఆపాలి

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్,(ప్రజా పందా)
జిల్లా కార్యదర్శి కే.రాజన్న

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గమైన,దురంకార,దాడులను,యుద్ధం వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో తేదీ,6.3.2026 శుక్రవారం రోజున జిల్లా కేంద్రంలో,అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మ దాహన చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ ప్రపంచ వనురులు కొల్లగొట్టడానికి ప్రపంచ వాణిజ,రాజకీయ,ఆర్థిక,ఆధిపత్యం కోసం అమెరికా దాని పెంపుడు జంతువు ఇజ్రాయిల్ మరో మరణహోమం చేస్తూ రక్తపు చేతులతో మానవత్వం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నదని ఇది నగ్నమైన అమానుషమైన చర్యలకు దొండ మూసుకు మాత్రమేనని అన్నారు.అమెరికా దురంకారంతో ఆయిల్ ఆధిపత్యం కోసం యుద్ధాలు చేయడం దుర్మార్గమైన చర్య అని ఈ యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని అంతర్జాతీయ సంస్థలు జోక్యం చేసుకోవాలని,డిమాండ్ చేశారు.ఆస్తి నష్టం ప్రాణ నష్టం ధరలు పెరిగి సామాన్య




ప్రజలకు జనజీవనం స్తంభించిపోయి కోల్పోలేదు పరిస్థితి ఏర్పడుతుందని కేవలం ఆయిల్ ఆధిపత్యం కోసమే దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని ఈ యుద్ధాన్ని ఆపి శాంతి కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు ఎం.బక్కన్న ఆర్ రామ లక్ష్మ ణ్ ఎస్.గంగన్న,పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కే.లక్ష్మి ఎండిగపూర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు ప్రారంభం

**ప్రజాపక్షం / తిర్యాని :** మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయాలను శుభ్రపరచడంతో పాటు పాత ఫైళ్లను సర్దుబాటు చేసి పరిశుభ్రంగా ఉంచే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేముల మల్లేష్ తిర్యాని గ్రామపంచాయతీని సందర్శించి హరితహారం ట్రాన్స్‌ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ పరిసరాలను ఆయన స్వయంగా శుభ్రపరిచి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామాలలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని మల్లేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**ప్రజాపక్షం/ముధోల్ :** మండల కేంద్రమైన ముధోల్‌లో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామ సర్పంచ్ షబానా బేగం ఇజాజోద్దీన్,ఈఓ అన్వర్ అలీ పర్యవేక్షిస్తూ పనులను నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్యంలో భాగంగా రోజు వారీగా ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించడం,రోడ్లను శుభ్రంగా ఉంచడం అదే విధంగా మురికి కాలువలను సైతం ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ దోమల బెడద లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అదే విధంగా ఎండాకాలం దృష్టిలో ఉంచుకుని నీటి కొరత లేకుండా ప్రతి కాలనీలో బోర్లు వేయడం జరిగిందని పేర్కొన్నారు.గ్రామంలో ఏమైనా ఇబ్బందులుంటే పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు.గ్రామాభివృద్ధిలో భాగంగా తమ వంతుగా గ్రామ ప్రజలు సైతం సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ సత్యంను సన్మానించిన న్యాయవాదులు

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ కోర్టు ప్రాంగణంలో 11వ వార్డు కౌన్సిలర్ న్యాయవాది చిన్నం సత్యనారాయణను సన్మాచిన సహచర న్యాయవాదులు.ఖానపూర్ మున్సిపాలిటీ 11వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్గా గెలుపొందిన న్యాయవాది చిన్నం సత్యనారాయణ మొదటిసారిగా ఖానాపూర్ కోర్డుకు వచ్చిన సందర్భంగా న్యాయవాదులు ఆయను శాలువతో సన్మానించారు.ఇలాంటి విజయా అవకాశాలు మరెన్నో అందుకోవాలని సహచర న్యాయవాదులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదలు వెంకట మహేంద్ర,నేరెళ్ల సత్యనారాయణ శేఖర్,రమణ,కిషోర్ నాయక్,శివ కుమార్,షబ్బీర్ పాషా,ఖదీర్,వేణు తదితరులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అట్టహాసంగా ప్రజపాలన-ప్రగతి ప్రణాళిక ప్రారంభం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కళాశాల విద్యాశాఖ కమీషనర్ ఆదేశాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన ప్రజాపలీనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ .యం.సుధాకర్ ప్రరాంభించారు.ఇందులో భాగంగా అద్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి కార్యక్రమం ప్రాధాన్యతను,చేపట్టవలసిన అంశాలను వివరించారు.పది రోజుల ప్రత్యేక ప్రణాళికను రూపొందించి,వివిధ కమిటీలు ఏర్పాటు చేసి వారికి బాధ్యతలు అప్పగించారు.తొలి రోజు కళాశాల ఆవరణలోని బోటానికల్ గార్డెన్,కళాశాల పరిసరాలను శుభ్రం చేయించారు.ఇందులో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు,ఎన్.సి.సి క్యాడెట్లు పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అద్యాపకులు,ఆఫీసు సిబ్బంది తమ తమ రికార్డులను అప్ డెట్ చేసుకోవాలని,కళాశాల అవసరాలను గుర్తించి వాటిని నెరవేర్చేందుకు కృషి చేయాలని అన్నారు.ఇందులో వైస్ ప్రిస్సిపాల్ డా.యు.గంగాధర్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగ శ్రీనివాస్ ఎన్.ఎస్.ఎస్.కోఆర్డినేటర్ అర్చన,డా.టి.శ్రీనివాస్,ఐక్యుఏసి కోఆర్డినేటర్ జి.సుధాకర్,కె.శ్రీహరి,కె.సూర్యసాగర్ పాల్గొన్నారు.



# ముగిసిన మోర్తాడ్ వెంకన్న బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ఫిబ్రవరి 27వ తేది నుంచి ప్రారంభమైన మోర్తాడ్ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 6వ తేదితో ముగిశాయి. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర పాల్గున మాస శుద్ధ ఏకాదశి రోజున ప్రారంబమైన ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 5న గురువారం రోజు నిత్య హోమం బలిహరణం, తీర్థ ప్రసాదం రాత్రి నిత్యం హోమం రాత్రి రెండు గంటల 18 నిమిషాలకు రథోత్సవం ప్రారంభమై శుక్రవారం ఉదయం 4గంటలకు కార్యక్రమాలు పూర్తయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు జాతరలో పాల్గొనేందుకు అనేకమంది వచ్చి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ప్రజల్ని చల్లగా చూడాలని రైతులు పండిస్తున్న అనేక రకాల పంటలకు చీడపీడలు లేకుండా చూడాలని ఆ పంటలకు గిట్టుబాటు ధర రావాలని రైతుల అభివృద్ధి చెంది పాడిపంటలు బాగుండాలని కోరుతూ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామిని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ జాతరకు మోర్తాడ్ మండల ప్రజలే కాకుండా చుట్టు పక్కల మండల ప్రజలతో పాటు మెట్పల్లి, నిర్మల్ తదితర గ్రామాల ప్రజలు వచ్చి ఇక్కడ మొక్కులు తీర్చుకుంటారని స్థానిక ప్రజలు తెలిపారు. ఇక్కడ జాతరలో రథోత్సవంలో అనేక మంది పాల్గొని రథాన్ని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి మందిరం నుంచి తాళ్లతో లాగుతూ శావ గద్దె వరకు తీసుకవస్తారు. తిరిగి ఎక్కడ నుంచి మందిరం వరకు తీసుకెళ్లి అక్కడ పెడతారు. ఇక్కడ రథోత్సవంలో ఊరేగించే రథం 1932సంవత్సరంలో శ్రీ రాజమల్లారెడ్డి చేయించి ఇచ్చినట్లు మొత్తంపై చెక్కిన శిలాశాసనం చెబుతుంది. ఇంత పెద్ద రథం జిల్లాలో ఎక్కడ కూడా లేదని స్థానిక ప్రజలు చెప్తుంటారు. ఇక్కడ జాతర సందర్భంగా ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా మోర్తాడ్ ఎస్సై రాము, పోలీస్ బందోబస్తు నిర్వహించి పర్యవేక్షించారు. స్థానిక వీడీసీ సభ్యులు జాతరకు వచ్చే వ్యాపారస్తులకు, భక్తులకు కావాల్సిన మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాల కాంతులతో రథోత్సవం నిర్వహించారు. శుక్రవారం చక్రతీర్థంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.



## పరీక్ష కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ డివిజన్‌లో 8వ రోజు జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల కేంద్రాలను ఆకస్మికంగా ఫ్లాయింగ్ స్క్వాడ్ ఎండి.పహీం ఉద్దీన్ బృందం తనిఖీ చేశారు. ఎలాంటి మాస్ కాఫీయింగ్ కు తావు లేకుండా పరీక్షలు పకడ్బందిగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు, డిపార్టమెంటల్ ఆఫీసర్‌లకు సూచించార. బోధన్ డివిజన్‌లో 12పరీక్ష కేంద్రాలలో 3035విద్యార్థులకు గాను 2964మంది విద్యార్థులు హాజరయ్యారని, 71 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి టి.రవి కుమార్ తెలిపారు.

## వరిసాగులో సరికొత్త పద్ధతి

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలోని అయిలాపూర్ గ్రామంలో డాక్టర్‌రెడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐలాపూర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉదయం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, నిజామాబాద్ డిప్యూటి ప్రాజెక్టు మేనేజర్‌వారి సమక్షంలో మెట్టవారి పద్ధతుల ద్వారా వరి పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట పండించే పద్ధతి నిర్వహణ గురించి వివరించారు. పలువురు రైతులు పాల్గొన్నారు. తక్కువ ఖర్చుతో పంట పండించడం, కూలీల కొరత వంటి పలు అంశాల గురించి వివరించారు.

## రేణుక అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన

### అన్నదాన సత్రం, ఊరేగింపు

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలోని అయిలాపూర్ గ్రామంలో శుక్రవారం గౌడ కులస్తుల ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ విగ్రహం ప్రతిష్టించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని ఊరేగింపు తీశారు. శుక్రవారం పూజా కార్యక్రమానికి గౌడ కులస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పూజలు ఈనెల 11 వరకు ఉంటాయి.



## నవ దంపతులకు బుద్ధుడి పుస్తకం బహుకరణ

**ప్రజాపక్షం/మోర్తాడ్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత తరుణంలో బౌద్ధ పెండ్లీలు, సామాజిక పెండ్లీలు విపరీతంగా సాగుతున్నాయి. ఒకవేళ అలాంటి వివాహాలు జరగకపోయిన ప్రతి వివాహంలో దంపతులకు జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ బుద్ధుడి లాంటి మహానీయుల ఫోటోలు లేదా గ్రంథాలు ప్రజలు బహుమానంగా ఇస్తున్నారు. అందులో భాగంగానే నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామంలో జరిగిన నవ దంపతులకు పరిశోధాత్మక గౌతమ బుద్ధుడి పుస్తకం బహుకరించారు. శుక్రవారం పాలెం గ్రామానికి చెందిన కూన రవితేజ వరుడు, పెర్కిట్ గ్రామానికి చెందిన వర్షా వధువులకు మధ్య వైభవంగా వివాహం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ యువత అంబేడ్కరైట్ నాయకులు, జర్నలిస్టులు కలిసి ప్రఖ్యాత బుద్దిస్ట్ రచయిత బొర్రా గోవర్ధన్ రచించిన బౌద్ధం వైజ్ఞానిక మార్గం అనే గొప్ప గ్రంథం బహుకరించారు. ఈ పెండ్లి ఉత్సవంలో పాలెం ఏవైఎస్ మాజీ అధ్యక్షులు గైతం మాలజీ, మల్లారి పృత్వీ, అరె అరుణ్ కుమార్, మామిడి రవి, జర్నలిస్టులైన కట్కే రవీందర్, సామ్రాట్ అశోక్, అంగులి మాలజీ, గన్నారపు శంకర్, మూల నివాసి మాలజీ పాల్గొని నూతన వధు వరులకు ఆశీస్సులు వెదజల్లారు.




## బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

### సిఐటియు మండల కన్వీనర్ గంగాధర్

**ప్రజాపక్షం/ఎడపల్లి:** గ్రామ పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని అలాగే గ్రామ పంచాయతీ కార్మికుల గల సమస్యలన్నింటిని తక్షణమే పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జంగం గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులకు మూడు నెలల వేతనాలు చెల్లించడం లేదని కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ మంజూరైన కార్యదర్శులు నూతన సర్పంచులు కార్మికులకు వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. అంతేగాకుండా నిజామాబాద్ జిల్లాలో మరో 150మంది కార్మికులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందని వారిని వెంటనే నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సబ్ కమీటీ కన్వీనర్ జె.పద్మ ఎడపల్లి మండల అధ్యక్షుడు ప్రవీణ్, ఎడపల్లి మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.




## కౌలు రైతు కష్టాలు నకిలీ విత్తనాలతో నష్టాలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మండల పరిధిలోని చల్మెడ గ్రామ శివారులో కౌలు రైతు హరిలాల్ మొక్కజొన్న 10 ఎకరాలు కౌలుకు తీసుకొని వేయగా అందులో ఐదు ఎకరాలు మొక్కజొన్న పంట ఆకు ఎండిపోవడంతో దిగులు చెందాడు . ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ మండల కేంద్రం లోని శ్రీ సాయి వర్ష ఫర్టిలైజర్ దుకాణంలో భారతి 99 మొక్కజొన్న విత్తనాలను తీసుకోవడం జరిగిందని అన్నారు. ఎకరాకు 40 నుండి 45 కింటల వరకు పంట దిగుబడి వస్తుందని డీలర్ చెప్పడంతో తీసుకొని విత్తనాలను చల్లడంతో మొక్కజొన్న కొంచెం పెరిగే సమయానికే ఆకులు ఎండిపోవడంతో ఏమి చేయాలో తెలియక వ్యవసాయ అధికారులను, ఫర్టిలైజర్ డీలర్ కు కూడా సంప్రదించగా వారు చెప్పిన క్రిమిసంహారక మందులను పిచ్చకారి చేయడం జరిగిందన్నారు. ఎన్ని మందులు కొట్టినా కూడా తగ్గకపోవడంతో ఏమి చేయాలో తెలియడం లేదన్నారు. ఐదు ఎకరాల మొక్కజొన్న పెట్టుబడి దాదాపు లక్ష రూపాయలు అయిందని ఈ నష్టాన్ని విత్తన కంపెనీ వారు డీలర్ భరించి నాకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాను అన్నారు. ప్రభుత్వం కూడా నాకు తగిన న్యాయం చేయాలని నకిలీ విత్తనాలను మందులను అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను అన్నారు.



## 6 నుండి ప్రజాపాలన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు,ప్రిన్సిపాల్ సెక్రటరీ, సంచాలకులు ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం 6వ వార్డులో చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి ప్రారంబించి మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 6 నుండి జూన్ 12 వరకు 99 రోజులు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 99 రోజుల్లో కార్యక్రమాల్లో భాగంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటం, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం సంక్షేమం, పిల్లల భద్రత, రక్షణ, డ్రగ్స్ నివారణ కార్యక్రమం, రతులు వ్యవసాయంపై అవగాహన సమస్యలపై పరిష్కారం, విద్య, యువతకు క్రీడలు, మహిళా సంఘాల ప్రోత్సాహం, మహిళల కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించటం, పర్యావరణ రక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలోవైస్‌చైర్‌పర్సన్ సంటి లత నర్సయ్య, కమీషనర్ గోపు గంగాధర్, కౌన్సిలర్లు పర్స కుశలత అనంతరావు, ఆరేపల్లి శ్రీజ నాగేంద్రబాబు, సందీప్, రవి, సంగ్యానాయక్, లావణ్య నర్సయ్య, అనుపమ ప్రసాద్, బాలలక్ష్మి భగత్, నరేందర్, ఏఈలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## యుపిఎస్‌సిలో 259 ర్యాంకు



**ప్రజాపక్షం/భీమ్‌గల్:** మండలంలోని ముచ్కూర్‌కు చెందిన శనిగరం నవీన్‌రెడ్డి కుమారుడు శనిగరం వర్షిత్‌రెడ్డి యుపిఎస్‌సి ఆల్ ఇండియా ర్యాంకు 259 సాధించారు. గ్రామ యువత ప్రజల తరపున అభినందనలు ఉన్నతమైన ఉద్యోగం గ్రామం నుండి ఉద్యోగం చేపట్టడం చాలా సంతోషమన్నారు. ముచ్కూర్ గ్రామం నుండి కష్టపడి ఉద్యోగం సాధించిన శనిగరం వర్షిత్‌రెడ్డికి అభినందనలు యుపిఎస్‌సి ఆల్ ఇండియా 259 ర్యాంకుతో దేశంలోనే ఉన్నతమైన ఉద్యోగం ముచ్కూర్ గ్రామస్తునికి రావటం సంతోషంగా ఉంది.

## మార్చి 9న పెన్షనర్ల కుటుంబ సమ్మేళనం

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేసన్ నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 9న పెన్షనర్ల కుటుంబ సమ్మేళనాన్ని సుబాష్‌నగర్‌లోని పెన్షనర్ల భవనంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు అధ్యక్షులు శిర్ప హనుమాండ్లు, కార్యదర్శి ఈవిఎల్ నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నగర మేయర్ ఉమాదేవి తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రొపెసర్ అపర్ణ, ప్రముఖ డాక్టర్లు అరుణ, కృష్ణవేణి, మమత తదితరులు అతిథులుగా హాజరవుతున్నారు. కావున ఇట్టి కార్యక్రమాన్ని సభ్యులు తమ కుటుంబ సభ్యులతో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## మోర్తాడ్‌లో ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**ప్రజాపక్షం/మోర్తాడ్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం శుక్రవారం ప్రారంభం కానుండగా నిజామాబాద్ జిల్లా మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రత్యేక కార్యక్రమంను అధికారులు ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గత కొన్ని రోజుల నుంచి ఉన్న పాత బడి పాడైన సామాగ్రిని వేలం వేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సైపోద్దీన్ తెలిపారు. ఈ వేళలో ఆసక్తి గల కొందరు పాల్గొని పాత సామాన్లు కొనుగోలు చేశారని, కొనుగోలు చేసిన సామాన్లకు 1,50,000 వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ తహసీల్దార్ కృష్ణ, సర్పంచ్ భోగా ఆనంద్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు తెలిపారు.



# జిల్లాకు ప్రతిష్టాత్మకం కోర్టు భవన నిర్మాణం

## నేడు(శనివారం) శంకుస్థాపన కార్యక్రమం

## అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు





**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** నూతనంగా నిర్మించ తలపెట్టిన కోర్టు భవనాల సముదాయం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి మరో ఆకర్షణగా నిలవనుంది. మరో 50 సంవత్సరాల అవసరాలు తీర్చేలా అత్యాధునిక వసతులతో నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణానికి శనివారం ఉదయం శంకుస్థాపన జరగనుంది. పాత కోర్టు స్థానంలోనే సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.81 కోట్ల 60 లక్షల వ్యయంతో రూపుదిద్దుకోనున్న భవనంలో 12 రకాల న్యాయస్థానాలు కొలువుదీరేలా తీర్చిదిద్దనున్నారు. ఒక్కో అంతస్తు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం జరగనుంది. విశాలమైన కోర్టు హాళ్లు, ప్రతి అంతస్తులు ప్రత్యేకంగా వాష్ రూమ్ లు కక్షిదారులకు వెయిటింగ్ హాళ్లు కనీసం 300 కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తూ నూతన భవనం నిర్మించబోతున్నారు. సెల్లార్తోపాటు టెన్ ప్లస్ టు నిర్మాణ శైలితో రాబోయే రెండేళ్లలో పూర్తిస్థాయిలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

### ప్రతిష్టాత్మకంగా శంకుస్థాపన కార్యక్రమం

న్యాయస్థాన భవన సముదాయానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేకంగా కోర్టు ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి నీరజ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానాల్లో శంకుస్థాపనలో పాల్గొంటున్నారని వెల్లడించారు. హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లోని న్యాయవాదులు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. న్యాయమూర్తులు శ్రీమతి బి పుష్పలత, శ్రీమతి రాధిక జైస్వాల్, శ్రీ పి లక్ష్మణ చారి, శ్రీ ఏ ప్రవీణ్ కుమార్, న్యాయవాదుల సంఘం సిరిసిల్ల వేములవాడ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, సదానందం న్యాయవాదులు పాల్గొన్నారు.

# హరీష్‌రావు రాకతో బెంబేలెత్తుతున్న కాంగ్రెస్ నాయకులు

## బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌రావు



**ప్రజాపక్షం/గంగాధర:** బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు రాకతో కాంగ్రెస్ నాయకులు బెంబేలెత్తుతున్నారని గంగాధర మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చొప్పదండి నియోజకవర్గాన్ని పచ్చని కోనసీమలా మార్చింది గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనేన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎడారిలా మారిందని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ గత పది సంవత్సరాలుగ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత సాధించారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాల నుంచి అధికారంలో ఒక్క ఇటుక పెట్టి పని చేసిందేమీ లేదన్నారు. కెసిఆర్ కట్టిన వాటికి కలర్ వేసారని, బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులకు చివర్లో వచ్చి శిలాఫలకాలు పెట్టుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కేవలం కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు, బిఆర్ఎస్ నాయకులను తిట్టుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. చొప్పదండిలో మాజీ ఎమ్మెల్యే రవి శంకర్ సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించుకుంటే ఇప్పటి వరకు కాంగ్రెస్ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు. కాంగ్రెస్ తెచ్చిన మార్పు ఏమీ లేదన్నారు. రైతు బంధుకు రాంరాం చేశారని, తులం బంగారం, ఫీజు రీయంబర్స్‌మెంట్ ఊసే లేదన్నారు. పేదల ఇండ్లు కూల్చడమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ గ్రామాలలో ప్రజల్లో తిరగలేక హైదరాబాదులోనే ఉంటున్నారన్నారు. రైతులకు యూరియా ఇవ్వలేని చేతగాని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్‌ఌ ప్రజలు తరిమి కొట్టే రోజులు ముందున్నాయన్నారు. నాయకులు మడ్లపెల్లి గంగాధర్, శ్రీమల్ల మేఘరాజ్, వడ్లూరి ఆదిమల్లు తదితరులున్నారు.

## నూతన వధూవరులను జిల్లా ఉపాధ్యక్షుడి ఆశీర్వాదం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని వెంకట లక్ష్మి గార్డెన్స్ లో కాజిపల్లి గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకులు ఏడుమేకల కిరణ్ యాదవ్ సోదరి వివాహానికి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు,ముత్తారం మండల మాజీ జెడ్పిటిసి సభ్యులు చొప్పరి సదానందం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బక్కతట్ల వినీత్ యాదవ్, కేషనపల్లి గ్రామ ఉప సర్పంచ్ సింగనవేన సదయ్య యాదవ్ తోపాటు పాల్గొన్నారు.



# మచ్చుపేటలో 9ఎల్ కాలువ పూడికతీత పనులు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామ పరిధిలోని9 ఎల్ కాలువ పూడిక తీత పనులను సర్పంచ్ చిలివేరి జ్యోతిలక్ష్మణ్ శుక్రవారం ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది.గత కొన్ని ఏళ్లుగా పూడిక పేరుకుపోవడం వల్ల దిగువ ప్రాంత రైతులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న విషయాన్ని రైతుల సర్పంచ్ దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించిన సర్పంచ్ జెసిబి సహాయంతో 9ఎల్ కాలువలో పేరుకుపోయిన మట్టి,చెత్తను తొలగించి సాగునీరు సజావుగా ప్రవహించేలా చేశారు. కాలువ చివరన ఉన్న పొలాలకు నీరు అందక ఇబ్బంది పడుతున్న రైతులకు ఈ పనులతో మేలు జరుగుతోందని.ఏళ్ల తరబడి పేరుకుపోయిన పూడికను తీయించడం వల్ల కాలువ నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది.ఈ పనులు స్థానిక రైతుల సాగునీటి కష్టాలను తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని. సర్పంచ్ చేసిన ఈ పనికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# ముస్లిం సోదరులు చూపుతున్నఆదరాభిమానాలు మరవలేనివి

## ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సునీత రెడ్డి

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు తనపై చూపుతున్న ఆదరాభిమానాలు మరవలేని వని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు .శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని షాది ఖానా లో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే సునీత రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు.ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీత రెడ్డి ముస్లిం సోదరులను ఉద్దేశించి మాట్లాడారు పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఆకలి దప్పిక ను తట్టుకొని ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షలు చేస్తారని అన్నారు .రంజాన్ పండగను ప్రతి ఒక్కరు సోదరా భావంతో జరుపుకోవాలని ఆమె సూచించారు.

# బాగా చదివి మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** వచ్చే వార్షిక పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని రేగుంట గ్రామ సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను పెన్నులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉన్నారు.

# మండల స్థాయి అధికారులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** మల్లాపూర్ మండల స్థాయి అధికారులైన తాసిల్దార్ శ్రీనివాస్ ఎస్సై అనిల్ ఎంపీడీవో శ్రీకాంత్ లను వాల్గొండ శ్రీ రామలింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ పందిరి నాగరాజు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుక్రవారం ఘనంగా శాలువాలతో సన్మానించారు.సందర్భంగా వచ్చే గోదావరి పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సౌకర్యా ఏర్పాటు చేయాలని, పుష్కరాల్లో వాల్గొండా గ్రామానికి అధిక నిధులు వచ్చేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి జమాల్ కోశాధికారి డాక్టర్ బండి రాజు గౌడ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మురళి, కార్యవర్గ సభ్యులు నాగరాజు ,గంగాధర్ వెంకటేష్ ,గ్రామస్తులు రవి ,శేఖర్, సరిరామ్ ,తదితరులున్నారు.

# ఆదర్శలో పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా పాఠశాల ప్రిన్సిపల్ భూమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా వేడుకల్లో విద్యార్థులు విద్యార్థినిలు సాంస్కృతిక కల్చరల్ కార్యక్రమాలు చేపట్టి చూపరులను ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ భూమేష్ మాట్లాడుతూ వచ్చే వార్షిక పరీక్షలలో ప్రతి విద్యార్థి బాగా చదివి మెరుగైన ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థికి సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం ,విద్యార్థులు పాల్గొన్నారు.

